క్లుప్తంగా

గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ



దుత్తలూరు: మండల కేంద్రమైన దుత్తలూరులో నూతన గంగమ్మ గుడి నిర్మాణానికి భూమిపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇప్పటి వరకు దుత్తలూరు చెరువుకట్టపై గంగమ్మ విగ్రహాలు ఉన్నాయి. వాటి వద్ద ఆలయాన్ని నిర్మించాలని గ్రామస్తులు తీర్మానించి వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని కొబ్బరికాయలు కొట్టి గుడి నిర్మాణంలో ఎటువంటి ఆటంకాలు ఎదురుకాకుండా వేగవంతంగా పూర్తయ్యేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు.

బీసీ రుణాలకు దరఖాస్తు గడువును పెంచాలి



ఆత్మకూరు: బీసీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు గడువును పెంచాలని జిల్లా యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వన్నెం నాగరాజు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 15వ తేదీతో ప్రభుత్వం ప్రకటించిన దరఖాస్తు గడువు ముగిసిందన్నారు. పలువురు లబ్ధిదారులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో పొందలేకపోవడంతో దరఖాస్తు చేసుకోలేదన్నారు. బీసీల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు గడువు తేదీని పెంచాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

ఏసీపీకి అరుదైన గౌరవం



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఏసీపీ సుకన్య

ఉదయగిరి: ఉదయగిరి జూనియర్ సివిల్ కోర్టులో ఏసీపీగా విధులు నిర్వహిస్తున్న సుకన్యకు అరుదైన గౌరవం లభించింది. ఇటీవల విజయవాడలో జరిగిన డిజిటల్ ఎవిడెన్స్ రాష్ట్రస్థాయి వర్క్‌షాపులో సుకన్య పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో బెస్ట్ పార్టిసిపేషన్ ప్రశంసాపత్రాన్ని డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ అధికారి బైరా రామకోటేశ్వరరావు అందజేశారు. దీంతో కోర్టు సిబ్బందితో పాటు బంధుమిత్రులు అభినందనలు తెలిపారు.

నిత్యాన్నదానానికి రూ.5లక్షల విరాళం



ఎంపీ వేమిరెడ్డిని శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న అర్చకులు

సీతారామపురం : మండలంలోని ఇష్టకామేశ్వరీదేవి సమేత ఘటిక సిద్దేశ్వరస్వామి క్షేత్రంలో నిత్యాన్నదానానికి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. నెల్లూరులోని వీపీఆర్ నివాసంలో ఎంపీ వేమిరెడ్డి దంపతులను క్షేత్రం అర్చకులు చిన్నకాశయ్య, సుబ్బరాయుడు ఆదివారం కలిశారు. ఈ నెల 26న సిద్దేశ్వరం క్షేత్రంలో జరిగే శివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ దంపతులు నిత్యాన్నదానానికి నగదు విరాళాన్ని అందజేసినట్లు అర్చకులు తెలిపారు.

కళలకు జీవం పోస్తున్న తోట



పిల్లనగ్రోవి ఊదుతున్న కిషోర్ కుమార్



కోనసీమ కళాపరిషత్ నుంచి అంతర్జాతీయ పురస్కారాన్ని అందుకున్న కిషోర్‌కుమార్ (పాతచిత్రం)

కళ్ల ముందు కనిపించే దృశ్యాలకు, కలల ప్రపంచంలోని ఊహలకు ప్రాణం పోసేది చిత్రకళ. ఎంత సాంకేతికత అందుబాటులో ఉన్నా చేతితో తీరిదిద్దే అపురూపమైన చిత్రాలలో ఉట్టిపడే జీవకళే వేరు. అలాంటి చిత్రకళకు నేటికి ఎంతో మంది జీవం పోస్తున్నారు. అలాంటి వారిలో చేజర్ల ఉన్నత పాఠశాలకు చెందిన డ్రాయింగ్ మాస్టర్ తోట కిషోర్‌కుమార్ ఒకరు. చిత్రలేఖనంతో పాటు గాయకుడిగా,కవిగా, ఫ్లూటిస్ట్‌గానూ రాణిస్తూ తన విద్యార్థులను అందులో తీర్చిదిద్దుతూ కళల తోటను పండిస్తున్నారు.

చేజర్ల: కలువాయి మండలం కుల్లూరు గ్రామానికి చెందిన తోట కిషోర్‌కుమార్ చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేస్తున్నారు. తల్లిదండులు తోట ఈశ్వరయ్య, ఉమామహేశ్వరి. తండ్రి వృత్తిరీత్యా డ్రాయింగ్ మాస్టర్ కావడంతో కిషోర్‌కుమార్‌కు చిన్నప్పటి నుంచి చిత్రకళపై మక్కువ కలిగింది. తొలుత తండ్రి దగ్గర నుంచి ఓనమాలను నేర్చుకున్నారు. డిగ్రీ చదివిన తర్వాత డ్రాయింగ్‌లో డిప్లమో, టీచర్ ట్రైనింగ్‌ను పూర్తి చేశారు. ఆ తరువాత కొంత కాలం చిత్ర కళకు దూరమయ్యారు. మొబైల్ షాపు నడుపుకొంటూ జీవనం సాగించారు. ఈ క్రమంలో చేజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన డ్రాయింగ్ మాస్టర్‌గా అవకాశం లభించడంతో కళకు మళ్లీ దగ్గరయ్యారు. అప్పట్నుంచి చిత్రకళకు జీవం పోయడం ప్రారంభించారు. తాను స్వతహాగా చిత్రాలను రూపొందించడంతో పాటు విద్యార్థులకు చిత్రలేఖనంలో మెలకువలను నేర్పిస్తూ కళా కుసుమాలను విరబూయిస్తున్నారు. అంతేగాకుండా కవిగా కవితలు రాయడంతో పాటు గాయకుడిగా, ఫ్లూటిస్ట్‌గా కచేరీల్లో పాల్గొంటూ తన బహుముఖ ప్రజ్ఞను చాటుతున్నారు. కరాటేలో సైతం ప్రావీణ్యం సంపాదించారు.



విజయవాడలో జాతీయస్థాయి అవార్డు అందుకున్న కిషోర్‌కుమార్(పాతచిత్రం)

వరించిన అవార్డులు

కిషోర్‌కుమార్ చిత్రలేఖనంలో మూడుసార్లు జాతీయ అవార్డులు, ఒకసారి అంతర్జాతీయ అవార్డును అందుకున్నారు. విజయవాడలోని అంజీ ఆకొండి సంస్థ వారు అందజేసేజాతీయ అవార్డులను రెండుసార్లు పొందారు. ఈ ఏడాది 19 అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో కోనసీమ కళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రపంచస్థాయి చిత్రలేఖన పోటీల్లో ప్రతిభకనబర్చి అంతర్జాతీ అవార్డును పొందారు. అంతేగాకుండా డ్రాయింగ్ ట్రెయినింగ్ చేసే సమయంలో ఉమ్మడి ఆంధ్రదేశ్ స్థాయిలో గుంటూరులో నిర్వహించిన జాతీయ స్థాయి యానిమేషన్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికయ్యారు.







కిషోర్ కుమార్ చేతిలో ప్రాణం పోసుకున్న చిత్రాలు

చిత్రకళపై ఎంతో మక్కువ

నాకు చిన్ననాటి నుంచి చిత్రకళపై మక్కువ. తండ్రిని చూసి డ్రాయింగ్ మాస్టర్‌ను కావాలని ట్రెయినింగ్ పూర్తి చేశా. కొంతకాలం చిత్రకళకు దూరమై మొబైల్ షాపు నడుపుకొంటూ జీవనం సాగిస్తుండగా డ్రాయింగ్ మాస్టర్‌గా అవకాశం లభించింది. అప్పట్నుంచి మళ్లీ చిత్రకళపై దృష్టి సారించి చిత్రాలను గీయడంతో పాటు విద్యార్థులకు మెళకువలు నేర్పుతూ కళాకారులుగా తీర్చిదిద్దుతున్నా. —తోట కిషోర్‌కుమార్

మద్దతు ధర కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రావి మాల్యాద్రి

జలదంకి: రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధరను కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం మండలాధ్యక్షుడు రావి మాల్యాద్రి పేర్కొన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో రైతులతో సీపీఎం నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్యాద్రి మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో వరికోతలు ప్రారంభమయ్యాయన్నారు. ప్రభుత్వం గ్రేడ్–ఏ రకం ధాన్యానికి పుట్టికి రూ.19,750, సాధారణ రకానికి పుట్టికి రూ.19,500 మద్దతు ధరను ప్రకటించిందని తెలిపారు. ఈ ధరలు స్వామినాథన్ కమీషన్ సిఫార్సులకు లోబడి లేవన్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు అనుకూలించక దిగుబడులు బాగా తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. అయినా ప్రభుత్వం మద్దతు ధర తగ్గించడం దారుణమన్నారు. పుట్టికి కనీస మద్దతు ధర రూ.28వేల నుంచి రూ.30 వేల వరకు అందజేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే పుట్టికి రూ.3 వేలు తగ్గించి రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. వరికోతల ప్రారంభంలోనే ధరలు ఇలా ఉంటే మరికొన్ని రోజుల్లో మరింత బాగా తగ్గిపోయే అవకాశం ఉందన్నారు. గతంలో మిల్లర్లు, అవినీతి అధికారులు, కొనుగోలు సెంటర్ల సిబ్బంది ఏకమై దోపిడీ చేశారని గుర్తుచేశారు. ప్రస్తుతం అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మిల్లర్ల ఆగడాలు అరికట్టి కొనుగోలు కేంద్రాలను రైతులకు అనుకూలంగా ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకు రాష్ట్ర ప్రభుత్వం బోనస్‌గా రూ.500 పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరులోని ఏబీఎం గ్రౌండ్ నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు రైతులకు కనీస మద్దతు ధర కల్పించాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. మండలంలోని రైతులు, కౌలురైతులు, కార్మికులు భారీసంఖ్యలో ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాళ్లూరి మాల్యాద్రి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం మాల్యాద్రిరెడ్డి, వ్యవసాయ సంఘం కార్మిక అధ్యక్షుడు నరసింహం, తదితరులు పాల్గొన్నారు.

19న దేశ బడ్జెట్‌పై సదస్సు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని చెర్లో రమణారెడ్డి భవన్‌లో ఈ నెల 19న సీపీఎం ఆధ్వర్యంలో దేశ బడ్జెట్‌పై సదస్సు నిర్వహిస్తున్నట్లు పార్టీ పట్టణ కార్యదర్శి డేవిడ్‌రాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు నిర్వహించే సదస్సుకు పార్టీ నాయకులు మోహన్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిస్తారని చెప్పారు. పార్టీ అభిమానులు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నూతన మసీదు ప్రారంభం



అల్లాహ్ బోధనలను వివరిస్తున్న మౌజన్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు టెక్కే, వందూరుగుంట కూడలి ప్రాంతంలో ఎంటీకేఎస్ ట్రస్ట్ సహకారంతో నూతనంగా నిర్మించిన మస్జిద్–ఏ–షబానా మసీదును ఆదివారం ప్రారంభించారు. పట్టణంలోని మసీదులకు చెందిన మౌజన్లు, ఇమామ్‌లు, ముస్లిం మత పెద్దలు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అల్లాహ్ బోధనలను వివరించారు. అనంతరం భారీ స్థాయిలో అన్నదానం చేశారు.

‘పక్కా’నిర్లక్ష్యం



వింజమూరు(ఉదయగిరి): మండల కేంద్రమైన వింజమూరులోని జగనన్న కాలనీ లేఅవుట్‌లో పక్కాఇళ్ల నిర్మాణం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులకు స్టీలు చువ్వలను సరఫరా చేశారు. ఈ చువ్వలను మండల పరిషత్ కార్యాలయం అవరణంలో ఉన్న గృహ నిర్మాణశాఖ కార్యాలయం వద్ద నిల్వ చేశారు. అంతలో సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో స్టీలు చువ్వ పంపిణీ ఆగిపోయింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 8 నెలలు గడిచినా చువ్వ లబ్ధిదారులకు పంపిణీ చేయకపోవడంతో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగలేదు. లక్షలాది రూపాయలు విలువ చేసే స్టీలును నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎండకు, వానకు తడుస్తూ తుప్పు పట్టిపోతోంది. దీనిపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ ముప్పు..కలిగేనా కనువిప్పు



మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని సినిమాహాలు వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు



బీఎస్ఎన్ఎల్ కార్యాలయం వద్ద పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

ఆత్మకూరు: పట్టణంలో ప్లాస్టిక్ కవర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారు. దీంతో ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దర్శనమిస్తున్నాయి. ప్రధానంగా శ్రీనివాసమహల్, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, నేతాజీక్లబ్, బైపాస్ రోడ్డులోని కల్యాణ మండపం, పాత సినిమాహాలు, తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు కుప్పలు కుప్పలుగా కనిపిస్తున్నాయి. ప్లాస్టిక్‌తో పర్యావరణంతో పాటు ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఓ వైపు హెచ్చరిస్తున్నా ప్రజలు పెడచెవిన పెడుతున్నారు. దుకాణదారులు విచ్చల విడిగా కవర్ల వినియోగం, అమ్మకాలు చేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు తరచూ దాడులు చేసి ప్లాస్టిక్‌ను కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అద్దంలా మెరిసేదెప్పుడో?

- అధ్వానంగా గ్రామీణ ప్రాంత రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



దారుణంగా రామానుజపురం–చోడవరం రోడ్డు

కొండాపురం : ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం గుంతలపై తట్టమట్టి కూడా వేయలేదంటూ కూటమి ప్రభుత్వం నాయకులు విమర్శలు గుప్పించారు. తాము అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని ఆర్భాటం చేశారు. అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా గ్రామీణ ప్రాంత రోడ్ల దుస్థితి మాత్రం మారలేదు. ఇందుకు నిదర్శనమే కొండాపురం–పార్లపల్లి రోడ్డు. ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలే కనిపిస్తున్నాయి. అలాగే ఆదిమూర్తిపురం నుంచి గరిమెనపెంట వరకు ఉన్న రోడ్డును ఆరు నెలల క్రితం మరమ్మతుల పేరిట తవ్వేశారు. అప్పట్నుంచి మరమ్మతులు చేపట్టకుండా అలాగే వదిలేశారు. ప్రస్తుతం చింతలదేవి–గొట్టిగొండాల రోడ్డును తవ్వేస్తున్నారు. మరమ్మతులు చేపట్టకుండా బాగున్న రోడ్లను తవ్వి వదిలేస్తుండడంపై వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొమ్మి నుంచి జలదంకి మండలం చోడవరం వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. సుమారు 8 కిలో మీటర్ల దూరం ఉన్న ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు. సంక్రాంతికి ముందు రామానుజపురం నుంచి పార్లపల్లి వరకు సుమారు 8కిలో మీటర్ల మే రోడ్డు మరమ్మతులకు ప్రభుత్వం హడావిడిగా రూ.25 లక్షలు విడుదల చేసింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మరమ్మతు పనులను తూతూమంత్రంగా చేపడుతుండడంతో మూణ్నాళ్లకే తారు లేచిపోయి కంకర తేలుతోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు దగ్గరుండి పనులను చేయించాల్సి ఉన్నా కన్నెత్తి కూడా చూడడం లేదు. ఇదే అదునుగా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా పనులు చేస్తున్నాడు. అలాగే పార్లపల్లి నుంచి కొండాపురం వరకు ఉన్న రోడ్డు తారు లేచిపోయి అడుగులోతు గుంతలు పడి ఉన్నాయి. ఈ రోడ్డున నిత్యం అధికారులు తిరుగుతున్నా పట్టించుకునే వారే లేదు. ఇప్పటికైనా ఆధికారులు స్పందించి త్వరితగతిన రోడ్ల మరమ్మతు పనులు పూర్తి చేయించాలని మండల వాసులు కోరుతున్నారు.



కొమ్మి–పార్లపల్లి మధ్యన నాసిరకంగా వేసిన ప్యాచ్‌వర్క్

పొగాకు బ్యారెన్ దగ్ధం

మర్రిపాడు: మండలంలోని పల్లవోలుకు చెందిన ఇందిరమ్మ పొగాకు బ్యారెన్ ఆదివారం దగ్ధమైంది. బ్యారెన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తుండగా ఆకులు పొగ గొట్టాలపై పడడంతో మంటలు చెలరేగి ఆకుతో పాటు బ్యారెన్‌లోని టైర్లు, గొట్టాలు కాలిపోయాయి. స్థానికుల సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. సుమారు రూ.4లక్షల మేర ఆస్తి నష్టం జరిగినట్లు రైతు వాపోయారు.

బైక్‌లు ఢీ–ఇద్దరికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు: ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఆత్మకూరు మండలం గండ్లవేడు–వెన్నవాడ రహదారిలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయిప్రసాద్ వివరాల మేరకు.. గండ్లవేడు గ్రామానికి చెందిన మస్తాన్ తన మిత్రుడితో కలిసి బైక్‌పై వెన్నవాడకు వెళ్తున్నాడు. అదే సమయంలో వెన్నవాడకు చెందిన రమేష్ బైక్‌పై డీసీపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో రమేష్, మస్తాన్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను గ్రామస్తులు ఆటోలో ఆత్మకూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం రమేష్‌ను మెరుగైన చికిత్స కోసం నెల్లూరులోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో క్లీనర్ మృతి

నెల్లూరు సిటీ : ముందు వెళ్తున్న లారీని తప్పించే క్రమంలో బల్కర్ వాహనం చెట్టును ఢీకొని క్లీనర్ మృతి చెందిన ఘటన కాకుపల్లిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. మధ్యప్రదేశ్‌కు చెందిన కుసులేందర్(21) బల్కర్ క్లీనర్‌గా పనిచేస్తున్నారు. బల్కర్‌లో యాష్‌లోడ్‌తో ముత్తుకూరు నుంచి నెల్లూరు వైపు వస్తున్నారు. కాకుపల్లి వద్ద ముందు వెళ్తున్న లారీని క్రాస్ చేయబోయి బల్కర్ అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదంతో ముత్తుకూరు రోడ్డులో వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

‘రంగడి’ బ్రహ్మోత్సవాలకు స్తంభ ప్రతిష్ట నేడు

నెల్లూరు(బృందావనం) : రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో మార్చి 9 నుంచి 19వ తేదీ వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు నాందిగా సోమవారం ఉదయం 9 గంటలకు స్తంభ ప్రతిష్ట (పందిరి గుంజ) జరుగనుందని ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. భక్తులు తరలిరావాలని కోరారు.

మర్యాదపూర్వకంగా



చేజర్ల: మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు నాగా నాగిరెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని నివాసంలో మేకపాటిని కలిసి శాలువాతో సత్కరించారు.